క్లుప్తంగా

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు ఏర్పాట్లు



పామర్రు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 15వ తేదీ నుంచి ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ అరుణకుమారి తెలిపారు. బోటనీ, జూలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయని చెప్పారు. పరీక్షలకు కావాల్సిన అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. లాబ్‌లలో విద్యుత్ సౌకర్యాలు, పరికరాలు , కెమికల్స్ విద్యార్థులకు అందుబాటులో ఉంచామన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఉదయం, మధ్యాహ్నం రెండు పూటల ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. బోటనీ అధ్యాపకురాలు వి.కుమారి, జువాలజీ అధ్యాపకులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాబా పారాయణం ప్రారంభం



మండవల్లి: ఈ నెల 17వ తేదీన ప్రారంభం కానున్న షిర్డీ సాయి సంకీర్తనా మందిరంలో గురువారం అఖండ జ్యోతి, పారాయణం ప్రారంభించారు. ప్రతిష్ఠా మహోత్సవం వరకు అఖండజ్యోతి, పారాయణం జరుగుతాయని నిర్వాహకులు శ్రీరామఫణికుమార్ పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

వైభవంగా శాంతి కల్యాణం



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల శాంతి కల్యాణం గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఆలయ ఆవరణలోని వేదికపై ఉంచి అందంగా అలంకరించి మంగళ వాయిద్యాల నడుమ కనుల పండువగా కల్యాణ తంతు పూర్తి చేశారు. పలువురు భక్తులు ఈ కల్యాణంలో పాల్గొని స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి, సిబ్బంది పర్యవేక్షణ చేశారు.

పెరుమాళ్లకు డీఎన్నార్ పరామర్శ

ముదినేపల్లి రూరల్: మండలంలోని అల్లూరుకు చెందిన వైఎస్సార్ సీపీ నేత పెరుమాళ్ల రత్నకామేశ్వరరావును వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) గురువారం పరామర్శించారు. కామేశ్వరరావు తల్లి సుభద్రమ్మ ఇటీవలనే మరణించగా సమాచారం తెలుసుకున్న డీఎన్నార్‌తో పాటు పార్టీ నాయకులు రత్నకామేశ్వరరావును పరామర్శించి సుభద్రమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, పార్టీ ముదిరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్, మండల శాఖ అధ్యక్షుడు బోయిన రామరాజు, నాయకులు శీలం రామకృష్ణ, పేరే రామకృష్ణ, బత్తిన కిషోర్, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సతీష్, తదితరులున్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు



కైకలూరు: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో భుజబలపట్నం, ఆటపాక ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రశంసాపత్రాలను గురువారం అందించారు. సేవా సంస్థ సెక్రటరీ మాదెం సత్యనారాయణ మాట్లాడుతూ ఇటీవల ఏలూరులో నిర్వహించిన హేలాపురి బాలోత్సవంలో పాల్గొన్న విద్యార్థులకు పత్రాలు అందించామన్నారు. కార్యక్రమంలో కైకలూరు మానవత సంస్థ అధ్యక్షురాలు కొండ్రెడ్డి చిట్టెమ్మ, డైరెక్టర్ ముదునూరి రవిరాజు, దూలం వాసవి, బోయిన సత్య సూర్య ప్రభ, ముప్పవరపు హైమావతి, తలారి వేణుగోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కానుకలు లెక్కింపు

ముదినేపల్లి రూరల్: మండలంలో దేవదాయశాఖ ఆధీనంలో ఉన్న పలు ఆలయాల్లోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. అల్లూరు సోమేశ్వరస్వామి ఆలయంలోని హుండీల్లోని కానుకలు లెక్కించగా రూ.52104, వడాలి శ్రీజగన్నాథ స్వామి ఆలయానికి రూ.89151, గురజ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి రూ.61716, ఇదే గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయానికి రూ.7986 ఆదాయం వచ్చినట్లు ఆలయాల కార్య నిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. గుడివాడ డివిజన్ ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్ ఆధ్వర్యంలో పలువురు అర్చకులు, గ్రామ ప్రముఖులు లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.



ప్రమాదభరితంగా పెద దళితవాడ సమీపంలో మలుపు



పంచాయతీ కార్యాలయం ఎదుట టర్నింగ్‌లో



ఆంధ్రాబ్యాంకు వద్ద ప్రమాదకరంగా మలుపు తిరుగుతున్న ఆర్టీసీ బస్సు

మలుపులు కావు.. మృత్యు మార్గాలు..

మండలంలోని కౌతవరంలో ఎంఎన్‌కే రహదారిపై మలుపులు మృత్యు కుహరాలుగా మారుతున్నాయి. ఆంధ్రాబ్యాంకు, పెద దళితవాడ, గ్రామ పంచాయతీ కార్యాలయం, చెక్‌పోస్టు వద్ద ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. చెక్‌పోస్టు మలుపులో ఆటోలో ప్రయాణిస్తూ గతంలో ఇద్దరు కూలీలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కొంత కాలం క్రితం విద్యార్థి ప్రమాదంలో మృతి చెందాడు. మిగిలిన మలుపుల్లో అనేక సార్లు ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ఎదుట వచ్చే వాహనం కనబడకుండా మలుపులు ఉండటం వల్లనే ఈ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు.

– గుడ్లవల్లేరు



ప్రమాదాలకు నిలయంగా చెక్‌పోస్టు వద్ద మలుపు

మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన కైలే



పామర్రు: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ గురువారం తాడేపల్లిలో మర్యాద పూర్వకంగా కలిశారు.

యూనియన్ బ్యాంక్ సేవలు విస్తృతం చేస్తాం



ఏటీఎం సెంటర్‌ను ప్రారంభిస్తున్న రీజనల్ హెడ్ వెంకట్రావ్, బీఎం దుర్గా ప్రసాద్

పామర్రు: తమ సేవలను విస్తృత పరుస్తూ అందరికీ మరింత అందుబాటులోకి తీసుకొస్తామని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మచిలీపట్నం రీజినల్ హెడ్ కాటం వెంకట్రావ్ తెలిపారు. యూనియన్ బ్యాంక్ వద్ద రెనోవేషన్ చేసిన ఏటీఎంను పామర్రు శాఖ సీనియర్ మేనేజర్ టి.దుర్గా ప్రసాద్‌తో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట్రావ్ మాట్లాడుతూ అధునాత సౌకర్యాలతో వినియోగదారులకు మరింత మెరుగైన సేవలను అందించాలనే ఉద్దేశంతోనే ఈ ఏటీఎం ను ప్రారంభించామని చెప్పారు. ఈ ఏటీఎంలో నగదు డ్రా చేసుకోవడమే కాకుండా నగదును డిపాజిట్ చేసుకునే వెసులు బాటు కూడా ఉందని పేర్కొన్నారు. అదే విధంగా స్థానిక బ్యాంక్‌లో కూడా వినియోగదారుల సౌకర్యార్థం అన్ని రకాల వసతులను ఏర్పాటు చేశామన్నారు. బ్యాంక్ ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ చీఫ్ మేనేజర్ పరమేశ్వరరావు, బ్యాంక్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

మొవ్వ: సాంఘిక సంక్షేమ శాఖ ఉయ్యూరు డివిజన్ పరిధిలో గల వసతి గృహాల్లోని పదో తరగతి విద్యార్థులకు గురువారం మొవ్వ ఎస్సీ బాలికల వసతి గృహంలో ప్రతిభకు–ప్రేరణ సదస్సు నిర్వహించారు. అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ బి.మోహన్‌రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రగతి విద్యా సంస్థల వ్యవస్థాపకులు పూర్ణ చంద్రరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యను అభ్యసిస్తూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. ప్రభుత్వ హాస్టల్‌లలో చదివిన ఎందరో నేడు అత్యున్నత స్థానాల్లో ఉన్నారని చెప్పారు. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని చదువుతున్న పాఠశాలలకు, ఉంటున్న ప్రభుత్వ వసతి గృహాలకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మొవ్వ ఎంఈవో–2 శ్రీలక్ష్మి, మొవ్వ హై స్కూల్ ఉపాధ్యాయులు రాంబాబు, కోటేశ్వరరావు, శివ కోటేశ్వరరావు, ఫర్వీన్ సుల్తాన్, ఇజ్రాయల్‌లతో పాటు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న ప్రగతి విద్యాసంస్థల వ్యవస్థాపకులు పూర్ణచంద్రరావు

ఏరియా ఆస్పత్రిలో గుండెజబ్బుల ఇంజక్షన్

గుడివాడ టౌన్: గుండెకు సంబంధించిన వ్యాధులతో మృతి చెందుతున్న వారి సంఖ్య ఇటీవల పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్టెమీ గుండెకు భరోసా కార్యక్రమం ప్రవేశపెట్టిందని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. ఇందిరాదేవి తెలిపారు. ఏరియా ఆసుపత్రిలో ఈ కార్యక్రమాన్ని ఇందిరాదేవి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుండెనొప్పి అని అనుమానం వస్తే సుమారు రూ. 45 వేలు విలువచేసే ఇంజక్షన్ ఇస్తే కొంతవరకు దాని ప్రభావాన్ని తగ్గిస్తుందన్నారు. ఈ ఇంజక్షన్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కూడా అందుబాటులోకి తీసుకొచ్చామని పేర్కొన్నారు. గుండెనొప్పి ఛాతీలో మొదలై వెనుక వీపువైపు వరకు వస్తూ ఉంటే దానిని గుండెపోటుగా గుర్తించాలన్నారు. అట్టి పరిస్థితుల్లో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వస్తే ఈ ఇంజక్షన్ అందిస్తామని చెప్పారు. ఏరియా ఆసుపత్రి పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ ఎస్. ఇందిరాదేవి

ఆనందోత్సాహాలతో స్కూల్ వార్షికోత్సవం

పెదముత్తేవి(మొవ్వ): మొవ్వ మండలం పెద ముత్తేవి శ్రీ లక్ష్మీపతి స్వామి విద్యా విహార్ సంస్కృతోన్నత విద్యాలయం 68వ వార్షికోత్సవాన్ని విద్యార్థుల ఆనందోత్సాహాల నడుమ గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముముక్షుజన పీఠాధిపతి, పాఠశాల కరస్పాండెంట్ ముత్తేవి గౌరకృష్ణ స్వామీజీ అధ్యక్షోపన్యాసంతో ప్రారంభించి పాఠశాల అభివృద్ధిని వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉయ్యూరు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి అయినంపూడి పద్మజారాణి మాట్లాడుతూ పాఠశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యా బోధనను చేస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయురాలు కొల్లా మాధవి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పూర్వపు ప్రధానోపాధ్యాయుడు కోసూరు ఆదినారాయణరావు, దోనేపూడి దయాకరరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్య, క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.



శ్రీ లక్ష్మీపతి స్వామి విద్యా విహార్ విద్యా కుటుంబం

వాలీబాల్‌లో విన్నర్స్‌గా గుడ్లవల్లేరు విద్యార్థులు



విజేతలతో ఉపాధ్యాయులు



విజేతలైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

గుడ్లవల్లేరు: అవనిగడ్డ జోన్ లెవల్‌లోని గోగినేనిపాలెం ఎన్‌జీ రంగా జెడ్పీ పాఠశాలలో ఈ నెల 4, 5 తేదీల్లో జరిగిన 84వ గ్రిగ్ మెమోరియల్ ఉమ్మడి కృష్ణా జిల్లా సెంట్రల్ జోన్ జూనియర్ బాలుర వాలీబాల్ పోటీల్లో గుడ్లవల్లేరు ఏఏఎస్‌ఎమ్ అండ్ వీవీఆర్‌ఎస్ఆర్ హైస్కూల్లో 8వ తరగతి విద్యార్థులు విన్నర్స్‌గా నిలిచారు. ఈ విషయాన్ని ఆ హైస్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి గురువారం విలేకరులకు తెలిపారు. అలాగే గుడివాడలో జరిగిన సబ్ జోన్ లెవల్‌లో కూడా తమ విద్యార్థులు విన్నర్స్‌గా నిలిచారన్నారు. విజేతలు వి.పీటర్సన్ (కెప్టెన్), కె.సాయి గోపాల్, ఎస్.పార్థు శ్రీసాయి, ఎస్.సాత్విక, బి.రాకేష్, కె.వెంకట బాలాజీ, కె.నవదీప్, ఎస్.థమస్‌తో పాటు పీఈటీలు పి.భూపాల్‌రెడ్డి, రాధను యాజమాన్యంతో పాటు డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, ప్రిన్సిపాల్ లీనా సాతులూరి, ఉపాధ్యాయులు అభినందించారు.

గుడివాడ టౌన్: స్థానిక ఎస్‌పీఎస్ హైస్కూల్ విద్యార్థులు 84వ గ్రిగ్ మెమోరియల్ సెంట్రల్ జోన్ ఆటల పోటీల్లో ప్రతిభను ప్రదర్శించి విజేతలుగా నిలిచారని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ గురువారం తెలిపారు. విజేతలైన విద్యార్థులను పాఠశాల ఆవరణలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 4, 5 తేదీల్లో ఘంటసాల మండలం గోగినేనిపాలెంలో నిర్వహించిన పోటీల్లో తమ విద్యార్థులు ఖో–ఖో సీనియర్ విభాగం, జూనియర్ విభాగంలో ప్రతిభను ప్రదర్శించి విజేతలుగా నిలిచారన్నారు. గ్రిగ్ మెమోరియల్ ఆటల్లో తమ పాఠశాల విద్యార్థులు 24 సార్లు విజేతలుగా నిలవడం పాఠశాలకు గర్వకారణమన్నారు. విద్యార్థులను ఖో–ఖో సంఘం అధ్యక్ష కార్యదర్శులు యలవర్తి శ్రీనివాసరావు, ఎం.సత్యప్రసాద్, గుడివాడ డీవైఈఓ ఐ. పద్మరాణి, డీసీబీ కార్యదర్శి ఎస్‌కే జానీసాహెబ్, వ్యాయామ ఉపాధ్యాయుడు మడకా ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

కెమ్ క్వెస్ట్– 2025లో ఏఎన్నార్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ టౌన్: పీబీ సిద్దార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన కెమ్ క్వెస్ట్– 2025లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి ప్రథమస్థానం కైవసం చేసుకున్నారని ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ అన్నారు. గురువారం విజేతలైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కెమ్ క్వెస్ట్ పోటీల్లో తమ కళాశాల ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విద్యార్థులు క్విజ్, ఎలక్యూషన్, పోస్టర్ ప్రదర్శన, పీపీటీ విభాగాలలో పి. శ్యామ్ ప్రసాద్, కె. అంజలి, ఎన్. వాగ్దేవి, బి. వల్లి, జి. కిరణ్‌లు ప్రథమస్థానం సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, అధ్యాపకులు కె. సుభాషిణి, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఒక రోడ్డు తీర్మానమైతే.. మరొక రోడ్డు వేస్తారా?

మండల పరిషత్ సమావేశంలో సర్పంచ్ తాతబ్బాయ్

గుడ్లవల్లేరు: మండలంలోని పెంజెంద్రలో ఒక రోడ్డును నిర్మించేందుకు తమ గ్రామ పంచాయతీలో తీర్మానం చేస్తే... మరొక చోట సీసీ రోడ్డును నిర్మించారని ఆ గ్రామ సర్పంచ్ రేమల్లి తాతబ్బాయ్ ఆరోపించారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ సురేష్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. కనీసం రోడ్ల నిర్మాణాలకే గాక ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు వైఎస్సార్ సీపీకి చెందిన ఏ ఒక్క ప్రజా ప్రతినిధికీ కనీస సమాచారం లేకుండా టీడీపీ నాయకులే నిర్వహిస్తున్నారని సర్పంచ్ తాతబ్బాయ్ ఆవేదన వ్యక్తం చేశారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా మంచినీటి చెరువులను వెంటనే నింపుకోవాలని ఎంపీడీఓ టి.విజయసారథి గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. మంచినీటి చెరువులో గతంలో నిల్వ ఉన్న మురుగు నీటిని అవుట్ లెట్ ద్వారా బయటకు పంపించాక తాగునీటిని నింపాలని సూచించారు.

అస్తమానం గైర్హాజరేనా?

మండల సర్వసభ్య సమావేశానికి హాజరు కాని శాఖలపై ఎంపీడీఓ మరొక సారి ఆగ్రహించారు. గత సమావేశంలో జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేస్తానని ఎన్నిసార్లు హెచ్చరించినా ఆయా శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ గైర్హాజరు అవుతున్నారన్నారు. ఈ సమావేశానికి హెల్త్, సహకార అధికారులు, సోషల్ వెల్ఫేర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు హాజరు కాలేదు. తమ ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యులు లేరని వైద్య సిబ్బంది సమావేశంలో చెప్పటంతో అధికార, ప్రజాప్రతినిధులంతా ఆశ్చర్యంగా చూశారు. తమ పీహెచ్‌సీల్లో డాక్టర్లు లేక బయట నుంచి ఇన్‌చార్జుల డాక్టర్లే వస్తున్నారని సిబ్బంది సమావేశంలో విన్నవించారు. కనీసం మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశానికి రాకుండా అంత నిర్లక్ష్యం ఏమిటని ఎంపీడీఓ ప్రశ్నించారు. మరొకసారి ఇదే రిపీటైతే ఆయా శాఖల అధికారులపై ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. విద్యుత్ స్తంభాలను మురుగు కాల్వలు, సాగునీటి కాల్వల పక్కన ఆ శాఖ వారు వేసేటపుడు తమ డ్రైనేజీ, ఇరిగేషన్ శాఖాధికారులకు చెప్పాలని ఏఈలు లక్ష్మీ తులసి, నాగేశ్వరరావు కోరారు. అలా వేయటం వలన కాల్వల మరమ్మతుల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. సమావేశంలో తహసీల్దార్ బి.లోకరాజు, ఎంఈఓ జి.గోపాలరావు, ఏఈ నాగేశ్వరరావు, ఏఎస్ఐ సారథి, సర్పంచులు కోటప్రోలు నాగు, పామర్తి భాస్కరరావు, రేమల్లి తాతబ్బాయ్, గళ్లా అక్కయ్యనాయుడు, వీర్నాల లక్ష్మణరావు, ఎంపీటీసీ మండా దిలీప్, ముక్కు సోమేశ్వరరావు తదితర అధికార ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



అధికారులను సమావేశంలో అడుగుతున్న సర్పంచ్ తాతబ్బాయ్

బాబా ఆలయంలో అన్న సమారాధన

మండవల్లి: మండవల్లి పీహెచ్‌సీ వద్ద కొలువైన షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నీలి వెంకట అప్పారావు, మూలపేటకు చెందిన తమ్మినేని గణేష్ ఆర్థిక సాయంతో అన్న సమారాధన చేశారు. ఆలయ నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు, యిన్నా వెంకటేశ్వరరావు, బండారు వెంకయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

సోలార్ వినియోగంలో ముందడుగు

గుడ్లవల్లేరు: సోలార్ విద్యుత్ వినియోగించుకునేందుకు మండలంలోని సింగలూరు గ్రామస్తులు ముందడుగు వేశారు. గ్రామంలోని రీడింగ్ హాల్‌లో ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ బందారు శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి పీఎం సూర్య ఘర్ పథకం కింద సోలార్ విద్యుత్ ప్యానెల్స్ యూనిట్ల ఏర్పాటుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఆ గ్రామస్తులకు విద్యుత్ అధికారులు చేపట్టారు. సోలార్ వినియోగానికి గ్రామస్తుల నుంచి మంచి స్పందన లభించిందని విద్యుత్ ఏఈ ఎస్.వరకుమార్ అన్నారు. జిల్లా కలెక్టర్ సింగలూరు గ్రామమంతటా సోలార్ విద్యుత్ వినియోగానికి తమ శాఖ ఎస్ఈ ఎం.సత్యానందం, ఈఈ జి.వి.శ్రీనివాస్ కృషి చేస్తున్నారని చెప్పారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజి ఆదేశాల మేరకు సోలార్ వినియోగదానికి ముందుకు వచ్చే ప్రతి లబ్ధిదారునకు రాయితీని అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. విద్యుత్ లైన్‌మెన్ కె.సత్యనారాయణ, ఉప సర్పంచ్ నందం శ్రీనివాసరరావు, గ్రామస్తులు నందం చిట్టి, రమణయ్య, అర్జునరావు, పైడేశ్వరరావు, హనుమంతరావు, నాగ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చేపల చెరువులకు తాగునీటిని అమ్ముకుంటున్నారు



నందివాడ: కొందరు అధికారులు చేపల చెరువుల యజమానులకు తాగునీరు అమ్ముకుంటున్నారని శంకరంపాడు సర్పంచ్ కైలే సుబ్బారావు ఆరోపించారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పెయ్యల ఆదాం, ఎంపీడీవో మల్లేశ్వరి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరంపాడు సర్పంచ్ కైలే సుబ్బారావు మాట్లాడుతూ తమ గ్రామానికి నెప్రోలి చానల్ ద్వారా తాగునీరు రావడంలేదని, చంద్రయ్య మురుగు కాలువ ద్వారా నీరు ఇంజిన్లతో నింపుకుంటున్నామని చెప్పారు. రాత్రయితే కాలువలో నీళ్లు ఉండవని పేర్కొన్నారు. చేపల చెరువులకు నీళ్లు అమ్ముకుంటున్నారని తెలిపారు. అనంతరం ఎక్సైజ్ శాఖ అధికారి మాట్లాడుతుండగా వెంకట రాఘవపురం సర్పంచ్ కాకరాల సురేష్ నందివాడ మండలంలో ప్రతి గ్రామంలో 7 నుంచి 10 బెల్ట్ షాపులు ఉన్నాయని వీటికి అనుమతి ఎవరు ఇచ్చారో తెలపాలని నిలదీశారు. వైన్ షాపులు ద్వారా బెల్ట్ షాపులకు మద్యం విక్రయిస్తే లైసెన్సు రద్దు చేస్తామని సీఎం చంద్రబాబు తెలిపారన్నారు. కానీ చర్యలు తీసుకోవడం లేదన్నారు. బెల్ట్ షాపుల్లో క్వార్టర్ పై అదనంగా 50 రూపాయలు వసూలు చేస్తున్నారని తెలిపారు. ప్రతి గ్రామంలో 24 గంటలూ మందు అందుబాటులో ఉంటుందన్నారు. రామాపురంలోని పంచాయతీ పరిధిలో బుడమేరకు వేలం పెట్టగా రూ.1.50 లక్షలకు వేలం జరిగిందని ఆ నగదును కార్యదర్శి పంచాయతీలో జమ చేయకుండా సొంత ఖర్చులకు వాడుకున్నారని ఎంపీపీ తెలిపారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్డీ బాషా, వైస్ ఎంపీపీ సుధాకర్, సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు సర్పంచులు, పాల్గొన్నారు.

యువకుడి రక్తదానం

గుడివాడ టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు రక్తం అవసరం కాగా ఆర్‌కే వారియర్స్‌కు చెందిన యువకుడు కిరణ్ గురువారం రక్తదానం చేశారు. రక్తదానానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఆర్‌కే వారియర్స్ నాయకుడు మాచర్ల రామకృష్ణ(ఆర్‌కె) అన్నారు.

ప్రకటన